## క్లుప్తంగా

### శరవేగంగా రిజిస్ట్రేషన్లు



కుక్కంబాకం సచివాలయంలో రిజిస్ట్రేషన్లు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కుక్కంబాకం, కల్లివెట్టు గ్రామ సచివాలయాల్లో జగనన్న గృహ లబ్ధిదారుల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోందని గ్రామ కార్యదర్శి నందిని తెలిపారు. గతంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారుల ఇంటి పట్టాలను ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తోందన్నారు. కుక్కంబాకం గ్రామ సచివాలయం పరిధిలో 83 గాను 71 పూర్తికాగా, కల్లివెట్టు గ్రామ సచివాలయం పరిధిలో 54 రిజిస్ట్రేషన్లకు గాను 45 పూర్తి అయ్యారని తెలిపారు. వలంటీర్ల సహకారంతో త్వరితగతిన మిగిలిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామన్నారు. వీఆర్ఓ తేజ, వలంటీర్లు పాల్గొన్నారు.

### ముక్కంటి సేవలో జస్టిస్ నాగార్జునరెడ్డి



ఆలయంలో కుటుంబసభ్యులతో నాగార్జునరెడ్డి

**శ్రీకాళహస్తి:** శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఎలక్ట్రిసిటీ బోర్డు రెగ్యులర్ అథారిటీ చైర్మన్, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

### వైఎస్సార్ బీమా పంపిణీ

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలో బుచ్చినాయుడుకండ్రిగ గ్రామపంచాయతీ పరిధిలోని ఈబీసీ కాలనీకి చెందిన అంకయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమాకు సంబంధించి సాధారణ మరణానికిగాను రూ.10 వేల నగదును మృతుని కుమారుడు భాస్కర్‌కు గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా బుధవారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో రూ.లక్ష వస్తుందని, అంత్యక్రియలకు రూ.10 వేలు ఇచ్చి మిగిలిన రూ.90 వేలను నామిని అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు. వలంటీర్లు పాల్గొన్నారు.

### 16న టీటీడీ స్థానిక ఆలయాల్లో రథసప్తమి

**తిరుపతి(అలిపిరి):** టీటీడీ స్థానికాలయాల్లో ఫిబ్రవరి 16న శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ కోదండరామాలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం తదితర ఆలయాల్లో రథసప్తమి పర్వదినం నిర్వహిస్తారు. ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు సూర్యజయంతిని పురస్కరించుకొని టీటీడీ స్థానిక ఆలయాల్లో రథసప్తమి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆరోజు ఉదయం భానుని తొలి కిరణాలు సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామివారి నుదుటన, నాభి, పాదకమలాలపై ప్రసరించే అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు ఎదురు చూస్తుంటారు. చంద్రగిరిలోని శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో ఉదయం 8 గంటలకు తిరుచ్చిపై స్వామివారి వీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

### నేడు క్షత్రియ భవన నిర్మాణానికి భూమి పూజ

**తిరుపతి కల్చరల్:** క్షత్రియ సామాజిక వర్గ ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడే రీతిలో తిరుపతి–బెంగళూరు హైవే సమీపంలోని తూకివాకం బ్రిడ్జి వద్ద నిర్మించనున్న క్షత్రియ భవనానికి గురువారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు సూరప్ప శివరామరాజు, రాష్ట్ర అధ్యక్షుడు బలరామరాజు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. క్షత్రియ సామాజిక వర్గ ప్రజలు తిరుమల సందర్శనార్థం విచ్చేసినప్పుడు, విశేష కార్యక్రమాలు నిర్వహణతోపాటు నిరుద్యోగ యువతలో మరింత నైపుణ్య స్కిల్స్ పెంచేదిశగా అన్ని హంగులతో క్షత్రియ భవనం నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు రాజు, వెంకటరాజు, శేఖర్‌రాజు, సుకుమార్ రాజు పాల్గొన్నారు.

### లారీని ఢీకొన్న బైక్

**దొరవారిసత్రం:** నెలబల్లి గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్ద బుధవారం ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన వంశీకుమార్(24), ప్రసన్న(22) బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. నెలబల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిలో అదుపుతప్పి నిలిచి ఉన్న లారీని ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు నెల్లూరుకు రెఫర్ చేశారు. ఎస్‌ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆలయాలకు మహర్దశ

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- దేవస్థానం అనుబంధ ఆలయాల పునర్నిర్మాణ పనులకు భూమి పూజ
- అభివృద్ధి కనిపిస్తున్నా విమర్శలా?



కుమారస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధు, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రూ.38 లక్షలతో ఏడుగంగమ్మల ఆలయ ఆధునీకరణ పనులు, రూ.2.90 కోట్లతో కుమారస్వామి ఆలయం(విజ్ఞానగిరి)లో మహా మండపం నిర్మాణం, శ్రీధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.70 లక్షలతో నిర్మించనున్న దుకాణ సముదాయానికి ఎమ్మెల్యే, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంయుక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పురాతన ఆలయాలకు మహర్దశ కల్పించి పునర్నిర్మిస్తుంటే నాలుగేళ్ల తెరమరుగైన ఊరందూరుకు చెందిన నాయకులు తమకు ఉన్న ఇల్లు సరిపోలేదని మేడలు కట్టుకుంటూ ఆలయాలను ఎందుకు కడుతున్నారంటూ విమర్శలు చేయడం ఎంత వరకు సబబు అని తీవ్రంగా మండిపడ్డారు. బొజ్జల కుటుంబం 30 ఏళ్ల శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి ఏనాడూ ఆలయాల అభివృద్ధికి, ప్రజలకు ఒక మంచి చేయలేదని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. తన హయాంలో ఏడుగంగమ్మల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింపజేశామని, ఆర్డీవో కార్యాలయం తీసుకు వచ్చామని, పురపాలక సంఘాన్ని ఫస్ట్ గ్రేడ్‌కు తీసుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇవి టీడీపీ నాయకులకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు.



ధర్మరాజుల ఆలయం వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



ఏడు గంగమ్మ ఆలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్

**30 ఆలయాల పునర్నిర్మాణం**

పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో 30 పురాతన ఆలయాలకు మహర్దశ పట్టిందన్నారు. అభివృద్ధి కంటికి కనిపిస్తుంటే టీడీపీ నాయకులు నిందలు వేయడం సరికాదన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉండి కూడా స్వగ్రామంలోని పురాతన నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని పట్టించుకోలేదని, తాము అభివృద్ధి చేసి, 30 ఏళ్ల తరువాత కుంభాభిషేకం చేస్తుంటే ఆయన కుమారుడు అభినందించక పోగా విమర్శలు చేయడాన్ని జనం చీదరించుకుంటున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించకపోగా అవాస్తవ ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, రమాప్రభ, కొండూరు సునీత, లక్ష్మి, పసలసుమతి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, శ్రీదేవి, ఆలయ అధికారులు నూకరత్నమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పవన్ కుమార్, బాలాజీ, సూర్యప్రసాద్, ప్రముఖులు చంద్రశెట్టి, ఉప్పు కృష్ణయ్య, గుమ్మడి బాలకృష్ణయ్య, కన్నలి ప్రభాకర్‌రెడ్డి, కంఠా ఉదయ్‌కుమార్, మొగరాల గణేష్, కొల్లూరు హరినాథ్‌నాయుడు, భాస్కర్ ముదిరాజ్, యతిరాజులు, రమేష్, మాధవయ్య, మునిరాజారెడ్డి, కృష్ణ, లత, శివ యాదవ్, గిరిప్రసాద్ గౌడ్, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు



కందాడులో ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులతో బియ్యపు పవిత్రారెడ్డి

**ఏర్పేడు:** వైద్య, విద్యా వ్యవస్థల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకు వచ్చారని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కందాడు, ఎస్సీ కాలనీ, సదాశివపురం, శివగిరి ఎస్టీ కాలనీల్లో సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా కందాడులో శ్రీవినాయక స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమ కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నవరత్నాల పథకాల అమలుతో పేదల కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయని చెప్పారు. ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగనన్నేనని పేర్కొన్నారు. ఇలాంటి పాలనకు మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీదేవి, మోహనప్రియ, ఎంపీటీసీ సభ్యురాలు రేవతి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.



వినాయక స్వామి ఆలయానికి భూమి పూజ చేస్తున్న పవిత్రారెడ్డి

## నేడు మేర్లపాకలో గడప గడపకు..

**ఏర్పేడు:** మండలంలోని మేర్లపాక పంచాయతీ పరిధిలోని మేర్లపాక ఎస్సీ, ఎస్టీకాలనీ, కొత్తకండ్రిగ గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య బుధవారం ఒక సంయుక్త ప్రకటనలోగా తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

**ఏర్పేడు:** మండలంలోని మునగళపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజవేలు, పాఠశాల కమిటీ చైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నియామకం

**శ్రీకాళహస్తి:** జైభారత్ నేషనల్ పార్టీ శ్రీకాళహస్తి కోఆర్డినేటర్‌గా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన రొమ్మాల నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. జేబీఎన్పీ అధినేత వీవీ లక్ష్మీనారాయణ విజయవాడలో బుధవారం నిరంజన్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు.

## నేడు రేణిగుంటలో ఎమ్మెల్యే పర్యటన

**రేణిగుంట:** మండలంలో గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యటించనున్నారని, పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నట్లు ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు గుత్తివారిపల్లెలో వైఎస్సార్ మహిళా భవన్, 10.30గంటలకు వెదుళ్లచెరువులో ఎంపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ, 11గంటలకు గురవరాజుపల్లె నూతన సచివాలయ భవనం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు కరకంబాడి–2 సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా జరగనున్నట్లు వారు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంవీఐ దామోదర్ నాయుడు, ఆర్టీసీ డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని తెలిపారు. డ్రైవింగ్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన జి.వెంకటేశ్వర్లుకు రూ.వెయ్యి, జీవీ సుబ్బయ్యకు రూ.750, డి.నాగరాజుకు రూ.500 ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి, సత్కరించారు. చక్రవర్తి, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పలు యూనియన్ల నాయకులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్‌కు సన్మానం

## వేదిక్ వర్సిటీలో పండితులకు సత్కారం



వేద పండితులను సన్మానిస్తున్న వీసీ

**తిరుపతి సిటీ:** ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ పరిపాలన భవనంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతి దేవి పూజ నిర్వహించి, వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో సరస్వతి దేవిని ఆరాధించి చక్కని విద్య, జ్ఞానాన్ని పొందాలని ఆకాంక్షించారు. సరస్వతీ రూపాలైన వేద శాస్త్ర ఆగమ పండితులను సన్మానించడం మన కర్తవ్యమని తెలిపారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజలో పాల్గొన్న వేద పండితులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేద శాస్త్ర పండితులు ఏఎస్ గోవిందరాజ దీక్షితులు, బ్రహ్మశ్రీ కూచిభొట్ల సీతారామాంజనేయ అవధాని, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్‌జీ త్రిపాఠి, డీన్ గోళి సుబ్రమణ్య శర్మ, ఆర్‌వీ సత్యనారాయణాచార్యులు, డాక్టర్ సుబ్రమణ్య బిడే, ప్రొఫెసర్ టి.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సస్యరక్షణతో అధిక దిగుబడి

**బాలాయపల్లి(డక్కిలి):** మిరపలో సస్య రక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటగిరి ఉద్యాన శాఖ ఏడీఏ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బాలాయపల్లి మండలం కామకూరులో మిరప పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంటకు ఎర్ర నేలలు, నల్ల రేగడి నేలలు అనువుగా ఉంటాయని సూచించారు. మిరపను ఆకుముడత తెగులు సోకుతుందన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లేదా డైనోటెప్యూరాన్ మందు పిచికారీ చేయాలన్నారు.

## కండలేరులో 11.043 టీఎంసీలు

**రాపూరు:** కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.043 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హై లెవలల్ కాలువకు 120, లో లెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ భవనం ప్రారంభం

**సత్యవేడు:** మండలంలోని మల్లవారిపాళెం వెస్టులో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పార్క్సన్ పరిశ్రమ హెడ్ సెంథిల్ బుధవారం శ్రీసిటీ అధికారులతో కలిసి ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో పార్క్సన్ ప్యాకేజింగ్ పరిశ్రమ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా మల్లవారి పాళెం వెస్టు గ్రామంలో రూ.18.5లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మించారు. సమీపంలో శిథిలావస్థకు చేరిన మరో భవనం, మరుగుదొడ్లను ఆధునీకరించారు. సెంథిల్ మాట్లాడుతూ శ్రీసిటీ ఫౌండేషన్ సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వసతుల కోసం సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి తన ప్రకటనలో పార్క్సన్ కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా, పార్క్సన్ ఫైనాన్స్ హెడ్ సంతోష్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, అంగన్‌వాడీ కార్యకర్త కే.శశికళ, ఆయా మానస, సకి చెంచులక్ష్మి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సెంథిల్, శ్రీసిటీ అధికారులు

# జగనన్నతోనే సంక్షేమ పాలన



సిమెంట్ రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**ఏర్పేడు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లెలో రూ. 50 లక్షల అంచనాతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బండారుపల్లె ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో తనకు అత్యధిక మెజారిటీని ఇచ్చారని చెప్పారు. రూ.2 కోట్లుతో బండారుపల్లె నుంచి అంజిమేడు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం, రూ.30 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి, రూ.25 లక్షలతో బైపాస్, రూ.30 లక్షలతో మురుగు నీటి కాల్వలు నిర్మించనున్నట్లు వివరించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేదలు మృతిచెందితే ఆ కుటుంబానికి రూ.10 వేలు సొంత డబ్బులు అందజేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు నాయుడు హయాంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ హయాంలో ఎర్రచందనం అక్రమ రవాణా, ఇసుక మాఫియాతో 16 మంది మృతిచెందారని గుర్తు చేశారు. బొజ్జల కుటుంబం కరోనా సమయంలో ప్రజలకు కనబడలేదన్నారు. ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామంలో పేదకుటుంబానికి చెందిన డాక్టర్ మద్దిల గురుమూర్తిని జగనన్న ఎంపీగా చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు జీవిత, పెంచలయ్య, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు చెంచయ్య, అంకిరెడ్డి, మునికృష్ణారెడ్డి, గురునాథం, సునీల్, వెంకటేష్ యాదవ్, చెంగల్ రాయులు పాల్గొన్నారు.

# ఘనంగా వసంత పంచమి



బుచ్చినాయుడుకండ్రిగలో సామూహిక అక్షరాభ్యాసం

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పిల్లలతో తల్లిదండ్రులు అక్షరభ్యాసాలు చేయించారు. వసంత పంచమి సరస్వతిదేవి పుట్టిన రోజు కావడంతో అమ్మవారికిప్రత్యేక పూజలు చేసి, పిల్లలతో తల్లిదండ్రులు అక్షరభ్యాసం చేయించారు. కంచనపుత్తూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంచన పుత్తూరులో..

# ముస్లింల మద్దతు వైఎస్సార్ సీపీకే..



ఎంపీపీని సన్మానిస్తున్న మసీదు పెద్దలు

**రేణిగుంట:** మండలంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే తమ సంపూర్ణ మద్దతని రేణిగుంట ఇస్మాయిల్ మసీదు పెద్దలు షేక్ షాజహాన్, హబీబ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డితో కలిసి మసీదు పెద్దలు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ రేణిగుంట మండలంలో పేద ముస్లిం మైనారిటీల కుటుంబాల వారికి నిఖ్కా సమయంలో మేనమామ సాంగ్యం కింద ఎమ్మెల్యే బీరువా, మంచం, టీవీ అందజేయడం హర్షణీయమన్నారు. రేణిగుంటలో తమకు ఏ సమస్య వచ్చినా నేరుగా ఎమ్మెల్యేకు చెప్పుకునే స్వేచ్ఛ ఉందన్నారు. జగనన్న అమలు చేస్తున్న నవరత్న పథకాలు మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడం ఖాయమని తెలిపారు. అనంతరం ఎంపీపీని సన్మానించారు. ఖాదర్‌బాషా, వలీసాహెబ్, ఇస్మాయిల్, మహబూబ్ బాషా, కరీముల్లా, సలాం, ఇయాస్, అన్వర్, షరీఫ్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

**ఏర్పేడు:** సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పేడులోని శివ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో జగనన్నకు చెబుదాం మండల కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గుడిమల్లం రెవెన్యూలో ఏళ్ల తరబడి స్థానిక రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాలు అందజేయాలని పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ నరసింహా యాదవ్, రైతులు ఆర్డీఓకు అర్జీ అందజేశారు. మొత్తం 28 సమస్యలపై అర్జీలు అందగా, వాటిలో 22 రెవెన్యూ, 6 ఇతర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ గిడ్డయ్య చెప్పారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, ఎంఈఓ ప్రేమలత, పశు వైద్యురాలు శిల్పారెడ్డి, ఏఓ షణ్ముగం, పలువురు అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి

# జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



నాయుడుపేటలో మందులు పంపిణీ



రాపూరు: సైదాదుపల్లిల్లో వైద్య పరీక్షలు

**నాయుడుపేట టౌన్ :** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రూప, మోనిక తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాలపురం సచివాలయం పరిధితో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన 386 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సుబ్బారావు, నవీన్ కుమార్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

**104 వైద్య సేవలను వినియోగించుకోండి**

**రాపూరు:** మండల ప్రజలు 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజప్రమీల, భాను తెలిపారు. వారు బుధవారం కుమ్మరిగుంట, సైదాదుపల్లి గ్రామాల్లో రెండు 104 వాహనాల్లో వైద్య సేవలు అందించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్యశాలలకు రాలేక ఇబ్బందులు పడకుడన్న ఉద్దేశంలో ప్రభుత్వం 104 వైద్య సేవలను అందిస్తోందని వివరించారు.